క్లుప్తంగా

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి



సర్పంచ్‌ను తిరిగి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయాల్లో ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకు ంటున్నాయి. మండలంలోని గుండ్లమడుగుతండా సర్పంచ్ దశరథ్ గత బుధవారం బీఆర్ఎస్‌ను వీడి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సర్పంచ్ దశరథ్‌ను బుజ్జగించారు. దీంతో మంగళవారం సర్పంచు దశరథ్‌కు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు , గౌతపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ రాంలింగారెడ్డి , అరుణ్, అశోక్‌లు ఉన్నారు.

ఎండుతున్న పంటలు



కొడంగల్‌లో ఎండుతున్న కందిపంట

కొడంగల్ : వరుణదేవుడు ముఖం చాటేయడంతో నియోజకవర్గంలో పంటలు ఎండుముఖం పట్టాయి. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో రైతులు అధిక మొత్తంలో కంది పంట సాగు చేశారు. ఈ ప్రాంతంలో అధికంగా నల్లరేగడి, ఎర్రనేలలు, చెల్కలు ఉన్నాయి. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక పోవడం.. ఎండల తీవ్రత అధికం కావడం వల్ల ఎర్రనేలలు, చెల్కల్లో వేసి కంది పంట వాడి పోతోంది. వరుణ దేవుడు కరుణిస్తే పంటలకు జీవం వస్తుందని రైతులు అంటున్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న జంటలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉ. 5గంటలకు సుప్రభాత సేవ, మహాభిషేకం, 7గంటలకు నైవేద్యం, మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అర్చకులు దర్శనం కల్పించారు. 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వారిని హనుమంత వాహనంపై ఆలయ మడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవ చేయడమే లక్ష్యం

కమతం రాంరెడ్డి ట్రస్ట్ చైర్మన్ శైలేందర్‌రెడ్డి

పరిగి: పేద పిల్లలకు తన వంతు సహాయ సహకారాలు అందించడమే తన లక్ష్యమని కమతం రాంరెడ్డి ట్రస్ట్ చైర్మన్ శైలేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని బాలసదన్‌లోని అనాథ పిల్లలకు కమతంరాంరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా పిల్లలకు దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమతం రాంరెడ్డి రాజకీయాల్లో ఉన్నప్పుడు ప్రజలకు ఎన్నో సేవలు చేశారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని చెప్పారు. ఆయన సేవలను నియోజకవర్గంలో చిరస్థాయిగా నిలవాలని స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పేద పిల్లలకు సాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వెంకటనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి



యశోదమ్మ(ఫైల్)

దోమ : అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ కన్నుమూసింది. దోమ మండలంలోని బొంపల్లికి చెందిన యశోదమ్మ(88) గ్రామంలోనే అంగన్వాడీ టీచర్‌గా పని చేసింది. వయసు పైబడటంతో గత సంవత్సరం ఉద్యోగానికి వీఆర్ఎల్ తీసుకొని ఇంటి దగ్గరే ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం ఆమె ఆరోగ్య మరింత క్షీణించి మృతి చెందింది. అంగన్వాడీ టీచర్ మరణవార్త తెలుసుకున్న గ్రామ ఎంపీటీసీ రాములు విచారం వ్యక్తం చేశారు.

ఉత్సవాలకు విరాళం

తాండూరు టౌన్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన తుల్జాభవాని మాత ఆలయానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ మంగళవారం రూ. 35వేల విరాళం అందజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు, పట్టణ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు రాజు, అంజిలప్ప, శ్రీనివాస్, గోపాల్, తులసీరాం, ఆశప్ప, విఠల్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాత ఆగమాగం

- కోడ్ రాకతో ఆందోళన
- నగం మంది రైతులకు అమలు కాని రుణమాఫీ



మోమిన్‌పేటలోని ఎస్‌బిఐ బ్యాంకు

మోమిన్‌పేట: రాష్ట్రం ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ పలు సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో అన్నదాతకు అందట్లేదు. కొందరి ఖాతాలు మూతపడటం, మరికొందరికి మెసేజ్‌లు వచ్చినా డబ్బులు జమ కాకపోవడం వంటి సమస్యలతో రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదని వాపోతున్నారు. అలాగే, ఎన్నికల కోడ్ రావడంతో మాఫీ అవుతుందా లేదా అనే ఆందోళన ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష రుణమాఫీ చేపట్టి రైతులను గందరగోళానికి గురి చేస్తోందని రైతులు వాపోతున్నారు. 2020నుంచి రూ.25వేల నుంచి రూ.50వేల వరకు సగం మంది రైతులకు 2022వరకు రుణమాఫీ జరిగింది. మళ్లీ 2023 ఆగస్టు 15వ తేదీ నుంచి సెప్టెంబరు నెలాఖరులోగా రుణమాఫీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గడువు దాటి 20 రోజులు కావస్తున్నా రుణమాఫీపై స్పష్టత లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక రైతుకు రూ.లక్ష మాఫీ వచ్చింది.. ఇంకో రైతుకు కాలేదు. దీంతో ప్రభుత్వం ఇంతవరకే మాఫీ చేసి చేతులు దులుపుకొంటుందా అన్న అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రణాళికతో రుణమాఫీ చేస్తున్నారో రైతులకు అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం 2018 డిసెంబరు 11నాటికి ఉన్న రుణాలను రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. రూ.25వేలు ఉన్న రైతులకు కూడా ఇప్పటికి మాఫీ కాలేదు. కానీ, రూ.లక్ష రుణం ఉన్న కొంత మంది రైతులకు మాఫీ వచ్చింది. ఇది ఎలా సాధ్యమని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులను సంప్రదిస్తే 2018 డిసెంబర్ 11 వరకు తీసుకొన్న రుణాలు మాఫీకి అర్హులంటున్నారు. బ్యాంకరుల వద్దకు వెళ్తే అంత పైనుంచే, మాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో అర్హత కల్గిన పంట రుణాల ఖాతాలు 3235 ఉన్నాయి. అందులో ఇప్పటివరకు 1400ఖాతాలకు మాత్రమే మాఫీ జరిగింది. ఎస్‌బీఐలో 1952ఖాతాలుండగా 900ఖాతాలకు మాఫీ జరిగింది. పీఏసీఎస్ మోమిన్‌పేటలో 1373 పంట రుణ ఖాతాలకు రూ.4.02 కోట్లు మాఫీకావాల్సి ఉండగా 920ఖాతాలకు రూ.3.04కోట్లు మాఫీ అయింది. పీఏసీఎస్ మేకవనంపల్లిలో 1082 ఖాతాలకు రూ.5.14కోట్లు మాఫీ కావాల్సి ఉండగా 790 ఖాతాలకు గాను రూ.4.01కోట్లు మాఫీ జరిగింది. ఎన్నికల కోడ్ రావడంతో పూర్తి రుణమాఫీ జరుగుతుందో లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు రుణమాఫీ ప్రణాళికపై రైతులకు ఉన్న సందేహాన్ని తీర్చాలని వారు కోరుతున్నారు.

రూ.లక్ష రుణం ఉంది..



యూనియన్ బ్యాంకులో 2017లోనే రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. ప్రతి యేటా రెన్యూవల్ చేయిస్తున్నా. రైతులకు ఇస్తున్నమంటున్నా పావల వడ్డీ రావడం లేదు. పూర్తి వడ్డీ చెల్లిస్తున్నా. రుణమాఫీ కాలేదు. రోజు బ్యాంకుకు వచ్చి అధికారులను అడిగి వెళ్తున్నా. నాతోటి రైతులకు కొంత మందికి రూ.లక్షమాఫీ వచ్చింది. ఇది ఎలా సాధ్యం . అంత అయోమయంగా ఉంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో మాఫీ చేస్తుందా!

-రైతు రాంచంద్రారెడ్డి, ఎన్కేపల్లి

ఫిర్యాదు చేయండి



రుణమాఫీపై ప్రభుత్వం గ్రీవెన్ సెల్‌ను ఏర్పాటు చేసింది. మండల వ్యవసాయ శాఖ అధికారికి రుణ వివరాలతో ఫిర్యాదు చేయాలి. కొన్ని ఖాతాలు మనుగడలో లేకపోవడంతో మాఫీ డబ్బులు ప్రభుత్వానికి తిరిగి వెళ్తున్నాయి. ప్రభుత్వం విడతల వారీగా మాఫీ నిధులు బ్యాంకులకు నేరుగా అందిస్తుంది.

-జయశంకర్,
వ్యవసాయాధికారి మోమిన్‌పేట

నాణ్యమైన విత్తనాలు నాటాలి



వన నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మప్ప

ఎంపీడీఓ లక్ష్మప్ప

పెద్దేముల్: వన నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు నాటాలని ఎంపీడీఓ లక్ష్మప్ప పేర్కొన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల ఆత్కూర్, ఇందూరుతో పాటు పలు నర్సరీలను ఆయన పరిశీలించారు. అలాగే, కొత్త ప్లాంటేషన్, బ్యాగ్ ఫిల్లింగ్‌లను పరిశీలించారు. ప్రతి నర్సరీల్లో 5వేల మొక్కలు తప్పకుండా నాటాలని సూచించారు. మొక్కల కోసం విత్తనాలు నాటే ముందు నాణ్యమైన విత్తనాలను పరిశీలించి నాటాలని ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ అధికారులకు ఆదేశించారు. రైతులకు ఉపయోగపడే మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ రమేష్, పీఓ నర్సిములు, ఉపాధి హామీ ఈసీ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్‌లు విజయ్, మల్లేశం, శ్రావన్, పంచాయతీ కార్యదర్శి అర్చన, ఫీల్డ్ అసిస్టెంట్లు గోపాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని జిన్నారం సర్పంచ్ వెంకటేశం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఆయన తన అనుచరులతో కలిసి వికారాబాద్‌లో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ప్రసాద్‌కుమార్ గెలుపే ధ్యేయంగా పని చేస్తానన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ ధన్నారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ సబితానంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరోసారి తన భర్తకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి విజయం సాధిద్దామని తెలిపారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

- మండల అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కరుణ ఆదేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కరుణ

బషీరాబాద్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని బషీరాబాద్ ఎంపీపీ కరుణ అన్నారు. మండల అభివృద్ధికి, సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి కొత్త పనులు ప్రారంభించకుండా ప్రస్తుతం నడుస్తున్న పథకాలను, అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల్లో చిన్న చిన్న లోపాలున్నా మానవీయ కోణంలో పేదలకు అందేలా చూడాలని సూచించారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచులను, ఎంపీటీసీలు అందరు మండల అభివృద్ధికి కలిసి పనిచేయాలని తెలిపారు. అంతకుముందు అజెండా అంశాలపై జరిగిన సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులను ప్రశ్నించారు. పూర్తి చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఎప్పుడు వస్తాయని సర్పంచులు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున మరింత ఆలస్యం అవుతాయేమోనని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు..

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: సబ్బండవర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు తాము అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ముచ్చటగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అందరం కలిసికట్టుగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కారు గుర్తుకు ఓటు వేసేలా కార్యకర్తలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన ఆయా పార్టీల కార్యకర్తలు మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, ఎమ్మెల్యే సోదరులు కొప్పుల అనిల్ రెడ్డి, బీఆర్ఎస్ కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చౌడాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు కొత్తబలిజ రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, ఏఎంసీ చైర్మన్ హరికృష్ణ, శాంతిబాయితులసిరాం, రవి, రామకృష్ణముదిరాజ్, మహేశ్వరం రాములు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

కొడంగల్ : నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ప్రచారం జోరుగా సాగుతోంది. సోమవారం బొంరాస్‌పేట మండలం నుంచి ప్రారంభించారు. మంగళవారం కోస్గి మండలంలో పర్యటించారు. బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కోస్గి మున్సిపల్‌తో పాటు పలు గ్రామాల్లో సభలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు.

ముత్యాల పందిరి వాహనంపై స్వామివారు



ముత్యాలపందిరి వాహనంపై విహ స్వామివారు

అనంతగిరి: దసరా నవరాత్రులను పురస్కరించుకుని వికారాబాద్ పట్టణ ఆలంపల్లిలోని శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారు ముత్యాలపందిరి వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బతుకమ్మ సంబురం

తాండూరు టౌన్: తాండూరు పట్టణం సాయిపూర్ శాంతినగర్‌లో బతుకమ్మ సంబరాలు సంబురంగా సాగుతున్నాయి. మంగళవారం మాజీ జడ్పీటీసీ ఉప్పరి స్వరూప ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మను పేర్చి ఆటపాటలతో అలరించారు. కాలనీకి చెందిన మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.



అనంతగిరి: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



శాంతినగర్‌లో బతుకమ్మలతో మహిళలు



బతుకమ్మతో మహిళలు

ఎన్నికల వేళ అలసత్వం వద్దు



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్

కొడంగల్ : ఎన్నికల వేళ ఉద్యోగులు అలసత్వం వీడాలని పారదర్శకంగా, జవాబుదారీగా పని చేయాలని రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్ అన్నారు. మంగళవారం కొడంగల్‌లో వేర్వేరుగా ఫ్లయింగ్ స్కాడ్స్, నోడల్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు పలు సలహాలు సూచనలు చేశారు. ఎన్నికల విధుల పట్ల అవగాహన కల్పించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతలను విస్మరించరాదన్నారు. ఉన్నతాధికారుల దృష్టి కొడంగల్ అసెంబ్లీ ఎన్నికలపై ఉందన్నారు. అధికారులు ఎవరి పక్షాన ఉండకుండా ప్రజల కోసం పని చేయాలన్నారు. సెక్టోరియల్ అధికారుల బాధ్యతలు, విధుల గురించి వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలో శాంతి భద్రతలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



పైప్‌లైన్‌ను మరమ్మతులు చేయిస్తున్న సిబ్బంది

ధారూరు: మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామ ఓవర్‌హెడ్‌ట్యాంకు వద్ద పైప్‌లైన్ పగిలిపోయి తాగునీరు వృథా అవుతుందని, వెంటనే మరమ్మతులు చేయించాలని మంగళవారం డీపీఓ తరుణ్‌కుమార్ గ్రామ కార్యదర్శి సుమలతను ఆదేశించారు. 'సర్పంచు చూడరు..కార్యదర్శి పట్టించుకోరు' అనే శీర్షికతో ఆదివారం సాక్షిలో వచ్చిన వార్తకు డీపీఓ తరుణ్‌కుమార్ స్పందించారు. గ్రామ కార్యదర్శి సుమలత గ్రామానికి వెళ్లి పగిలిన పైప్‌లైన్‌ను మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టారు. పెద్ద పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల వాటర్‌గ్రిడ్ వారే మరమ్మతులు చేయించాలి, వారు చేతులెత్తేయడంతో తాము మరమ్మతులు చేయించినట్లు గ్రామ కార్యదర్శి సుమలత తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



మంగళ గౌరీ రూపంలో తుల్జా మాత



చంద్రఘంటి అలంకరణలో అమ్మవారు

పెద్దేముల్: మండల కేంద్రంలోని పెద్దేముల్ తండాలో దసరా నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తుల్జా భవాని దేవాలయంలో మంగళవారం ఆలయ పూజారి రాము, సంతోష్‌లు తుల్జామాతకు మంగళగౌరీ అవతారంలో ఆలంకరించారు. దీంతో మండల ప్రజలు, భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి నిత్యం ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. భక్తులు వచ్చి తీర్థ ప్రసాదాలు తీసుకోవచ్చని ఆలయ భక్తులు తెలియచేశారు.

చంద్రఘంటి రూపంలో అమ్మవారు

అనంతగిరి: నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారు మంగళవారం చంద్రఘంటి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మల్లికార్జునస్వామి ఆలయం, వెంకటపూర్ తండాలోని అమ్మవారి ఆలయం, శివారెడ్డిపేటలోని తుల్జాభవాని మాత ఆలయం, మహాలక్ష్మి ఆలయాలతో పాటు వైభవలక్ష్మి ఆలయం, రాంమందిరం, మండపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రామమందిరంలో జరిగిన ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల పాల్గొని పూజలు చేసి, బతుకమ్మలు ఆడారు.

కార్మికులకు అండగా రోహిత్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకుడు గోపాల్



ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్న కార్మికులు

తాండూరు టౌన్ : ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డితోనే కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని బీఆర్ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కె గోపాల్ అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలో భవన నిర్మాణ, సెంట్రింగ్ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి ఎమ్మెల్యే అన్నారు. కార్మికులకు కొండంత అండగా ఉంటున్నారన్నారు. రోహితన్న కార్మిక చేయూత కార్యక్రమం ద్వారా బీమా సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మికులంతా రోహిత్‌రెడ్డికే ఓటేయాలని కోరుతున్నారని తెలిపారు. స్థానికుడిగా కార్మికులకు ఎలాంటి కష్టాలు వచ్చినా ఎమ్మెల్యే అండగా నిలుస్తారని, స్థానికేతరులకు ఇక్కడ స్థానం కల్పించొద్దన్నారు.

ఇంటింటికీ 'గ్యారంటీ కార్డులు'

బొంరాస్‌పేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి 'ఆరు గ్యారంటీ కార్డులు' అమలు చేస్తామని ఆ పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. మంగళవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ఇంటింటికి తిరిగి గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజాసంక్షేమం తప్పక సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కోస్గి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు అంజిల్‌రెడ్డి, మండల నాయకులు జయకృష్ణ, నర్సిములునాయుడు, రాజేశ్‌రెడ్డి, మల్లేశ్, కిష్టప్ప, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌రెడ్డి

మర్పల్లి: బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకుపోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్‌హాల్‌లో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎస్ ప్రభాకర్‌గుప్తా, జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులతో శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోను చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు నివ్వరపోతున్నారని అన్నారు. డాక్టర్ మెతుకు ఆనంద్ భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ యాదయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, రాచన్న, ఉపాధ్యక్షుడు రమేష్ మిత్ర, అశోక్, తదితరులు ఉన్నారు.